ముత్తుములను మర్యాదపూర్వకంగా టీడీపీ నేతలు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డిని కంభం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ గురించి ఈ సందర్భంగా సంభాషించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మండల టిడిపి నేతలు సమిష్టిగా కృషి చేశారని వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో మరింత పటిష్టంగా కృషి చేసి తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంభం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

పరీక్ష సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు స్వయంకృషి సేవ సంస్థ సభ్యులు కుర్ర చిరంజీవి వారి ఆర్థిక సహాయంతో 80 మంది ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు కావలసిన సామాగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, డిజిపేట ఎంపీటీసీ మితికల గురవయ్య, ఎక్స్ ఏఎంసీ డైరెక్టర్ వీరాంజనేయులు, బోయ మడుగుల సర్పంచి మరియు జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి బోట్ల చిరంజీవి, అంకబాబు, బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు, భార్గవ్, చిట్ల శివ, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సర్వీస్ వైర్

నిండు ప్రాణానికి ఏమైనా అయితేనే స్పందిస్తారా

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలోని మఠం బజారు వీధి ఎదురుగా ఉన్న ఓ దుకాణం వద్ద సర్వీస్ వైర్ గత కొంతకాలంగా కిందికి వేలాడుతూ ఉంది. వర్షాలు పడిన సమయంలో పొరపాటున సర్వీస్ వైర్ ఎవరికైనా తగిలిన దృష్ట్యా వారి ప్రాణాలు హరించుకుపోతాయి. చిన్నారులకు కూడా ఆ సర్వీస్ వైర్ అందే ఎత్తులో ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్న వైనం. సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి స్థానికులు పలుమార్లు చెప్పినప్పటికీ స్పందించని వైనం. సంబంధిత విద్యుత్ సిబ్బంది ఇప్పటికైనా స్పందించి ఆ సర్వీస్ వైర్‌ను అక్కడి నుండి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నులు పురుగుల నివారణతో ఆరోగ్యం భద్రం

విశాలాంధ్ర-వెలిగండ్ల : నులిపురుగుల నివారణతో ఆరోగ్యాన్ని భద్రపరుచుకోవచ్చని ఎంపీడీవో తాతపూడి సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగులను నివారించినప్పుడు ఆరోగ్యాన్ని భద్రపరుచు కోవచ్చని తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ పెట్టి మాత్రలను ఏపించడం ద్వారా ఆరోగ్యం ఎంతో భద్రతగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దాస్ ప్రసాద్ ప్రధానోపాధ్యాయులు చింత విజయభాస్కర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యార్ని దగ్ధం

- రూ.6లక్షల నష్టం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని చిన్న ముప్పలపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు మరియు రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోటపాటి శేషయ్యకు చెందిన పొగాకు బ్యార్ని మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు సమయంలో దగ్ధమైంది. సుమారు 6లక్షల రూపాయల మేరకు ఆస్తి నష్టం నెలకొంది. ఈ విషయం తెలుసు కున్న వెంటనే టీడీపీ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆ ప్రమాద స్థలాన్ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి,మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య,గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, మరియు తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : నేడు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో దోర్నాలలోని, ప్రైవేట్ పరీక్ష కేంద్రాలను మంగళవారం ఎస్సై శ్రీనివాసరావు పరిశీలించారు. పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ సెంటర్ లను యజమానులకు జిరాక్స్ సెంటర్ లను మూసి వేయాలని తెలియజేశారు. ఇంటర్మీడియట్ ఇంటర్మీడియేట్ పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించు ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలియచేసారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు

విశాలాంధ్ర - శింగరాయకొండ : వివిధ పాఠశాలలు, ఇంజనీరింగ్ కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్‌లలో 14వేల 992 మంది విద్యార్థులకు ఆల్బం డజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖాధి కారులు తెలిపారు. శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఈకార్య క్రమాన్ని ప్రతి విద్యార్థికి అంద చేసినట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

వైసీపీ వర్సెస్ టీడీపీ

జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఎమ్మెల్సీ ఎన్నికలు కొత్త చిచ్చుకు శ్రీకారం చుట్టాయి. వైసీపీ, టిడిపి శ్రేణుల మధ్య కొత్త గొడవలకు కారణమైంది. ఒకవైపు టిడిపి శ్రేణులు నీవెంత అంటే నీవెంత అంటూ, మరో వైపు వైసీపీ శ్రేణులు మేమూ తగ్గేది లేదంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కడప ఫ్యాక్షన్ రాజకీయాలు ఒంగోలుకు తెచ్చారని టిడిపి నాయకులు అంటే, మీరు మీసాలు మెలేస్తుంటే చూస్తు ఊరుకోవాలా అంటూ వైసీపీ శ్రేణులు ప్రతి సమాధానం చెప్తున్నాయి. ఏదేమైన ఒంగోలులో వేసవికి ముందే రాజకీయాలు హీటు పుట్టిస్తున్నాయి.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాలినేని

- పెరుగుతున్న మాటల తూటాలు
- ఎమ్మెల్సీ ఎన్నికలతో మరింతగా పెరిగిన వివాదం
- ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ పరస్పర దూషణలు
- ఒంగోలులో చల్లారని వేడి

నేనూరుకున్నా కార్యకర్తలు ఊరుకోరు
-ఎమ్మెల్యే బాలినేని

విశాలాంధ్ర, ఒంగోలు : మమ్మల్ని రెచ్చగొడుతూ ఉంటే నేనూరుకున్నా మా కార్యకర్తలు ఊరుకోరని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీని వాసులరెడ్డి టిడిపి శ్రేణులను హెచ్చరించారు. తాను 6 సార్లు ఎన్నికలను ఎదుర్కొన్నానని, పలువురు తనకు పోటీగా నిలిచారని, అయితే వారెవ్వరూ ఇంత నీచం గా మాట్లాడ లేదన్నారు. ఏం మాట్లాడుతాడో ఏం చేస్తాడో తెలియదు గాని చివరకు తమపై బురద చల్లుతారన్నారు. గుప్తాను అడ్డుపెట్టు కుని,ఆయనకు డబ్బులిచ్చి మా మీద విమర్శలు చేయిం చారన్నారు. గుప్తా అతని స్థాయిని మించి తమపై విమర్శలు చేసేవాడన్నారు.ఏదాది కాలంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నారన్నారు. నన్ను దాటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కూడా విమర్శలు చేశార న్నారు. అతని స్థాయి ఏంటో మరిచి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఈశ్వర్ చొక్కాలు విప్పి, మీసాలు మెలేస్తూ, రెచ్చగొడుతూ, ఎన్నికలలో కూడా దౌర్జన్యం చేయాలని చూశారన్నారు. మా దగ్గర 200 మంది రౌడీలు ఉన్నారని బెదిరించటం తగదన్నారు. తమ వద్ద 100 మంది కార్యకర్తలున్నారని, రోజుకు 10 మంది చేత ప్రెస్‌మిట్‌లు పెట్టి బూతులు తిట్టిస్తామన్నారన్నారు. సంస్కారం తెలుసు కోవా లన్నారు. దౌర్జన్యం ఎవరు చేశారో దామచర్ల మొదట చెప్పాల న్నారు. పోలీస్ స్టేషన్‌లో దౌర్జన్యం చేసి మీ కార్యకర్తలను విడిపించుకుపోయింది నీవు కాదా అని దామచర్లను ప్రశ్నిం చారు. చంద్రబాబు ఫోన్ చేశాడంటూ కార్యకర్తలను విడిపించు కు పోతారా. అధికారంలో ఉంది టిడిపినా, వైసీపీనా అన్నారు. పిల్లాడి చేత నన్ను మాట్లాడిస్తావా అన్నారు. రెచ్చగొట్టి ఓటింగ్ ఆపేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు. స్టేషన్ నుండి మీ కార్యకర్తలను బయటకు తెచ్చినందుకు మీ మీద క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. నేను ఐదు సార్లు ఎమ్మెల్యే అయినా ప్రశాంతంగా ఉన్నానని, నీవు ఐదు సార్లు అయివుంటే ఊరును బతకనిచ్చేవాడివా అని ప్రశ్నించారు. నాడు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కమ్మ పాలెం లోకి కూడా రానివ్వలేదన్నారు. నా కారులో ఒక్కలేడీని తీసుకువచ్చానని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. జనార్ధన్ 6 కార్లలో వచ్చారని, ఆయన కార్లల్లో కర్రలు కూడా ఉన్నాయన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

రిటర్న్ గిఫ్ట్‌కు సిద్ధంగా ఉండు
- మాజీ ఎమ్మెల్యే దామచర్ల

ఐదు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిగా చేసిన బాలినేని,పెద్ద సీనియర్ పొలిటీషియన్ అని చెప్పుకునే నీవు ఎమ్మెల్సీ ఎన్నికలలోఎలా ప్రవర్తించాలో కూడా తెలియదా అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అన్నారు. ఒక్కో బూత్ దగ్గరకు ఐదారు సార్లు రావటం అవసరమాఅని, ముందు ఎస్కార్ట్, వేసుకుని వచ్చి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయటం ఎంత వరకు సబబన్నారు. ఆయన మంత్రి అను కుంటున్నాడో, ముఖ్య మంత్రి అను కుంటున్నాడో, గవర్నర్ అనుకుంటున్నాడో మాకు అర్థం కావటం లేదన్నారు. ఎన్నికల బూత్‌లలోకి 40 మందిని వేసుకుపోవటం ఆపిన ఎసైని వేలుపెట్టి చూపిస్తూ అనీ అంతు చూస్తా అంటూ బెదిరి చంటం ఎంత వరకు సబబన్నారు. బాలినేని ఒంగోలులో రౌడీజం చేయాలను కుంటున్నాడా, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలను కుంటున్నాడా అని ప్రశ్నించారు. పోలీంగ్ బూత్‌ల వద్దకు వెళితే గొడవలు వస్తాయని, ఉదయం 6 గంటల నుండి ఆఫీసులో కూర్చుని పర్య వేక్షిస్తుంటే, బాలినేని మాత్రం ఉదయం 9 గంటల నుండే పోలింగ్ స్టేషన్‌లకు పోవటం, ఓటర్లను, పోలీసులను భయ భ్రాంతులకు గురిచేయటం ఏంటన్నారు. ప్రశాంతంగా ఓటింగ్ చేయించు కుంటున్న టిడిపి కార్యకర్తలపై దౌర్జన్యం చేయటం దుర్మార్గమన్నారు. ఎవరెవరు కొట్టారో, ఎవరెవరు ఉన్నారో అన్నీ తమ వద్ద ఉన్నాయని, వారికి బాలినేని రిటర్న్ గిఫ్ట్ తప్పదని హెచ్చరించారు. మీరే కొట్టి మీరే కేసులు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్‌ల వద్దకు ముందుగా నేను రాలేదని, నేనెవరినీ రెచ్చగొట్టలేదని, వాళ్ల మనుషులను పోగోసి టిడిపి కార్యకర్తలను కొట్టమని నేను చెప్పలేదన్నారు. బాలినేని ఆ పనిచేశారన్నారు. ప్రతి ఒక్కరూ టివిలలో, సోషల్ మీడియాలో బాలినేని బాగోతం చూశారన్నారు.అవినీతి డబ్బులు ఉంటే ఇంట్లో కూర్చొని తినాలని, ఓటుకు రూ.20 వేలు పంచి పంపిణీ చేసుకోవచ్చన్నారు. టిడిపి కార్యకర్తలు కొడతామంటే చూస్తూ ఎవరు ఊరుకోరన్నారు. దాడి చేసిన వారిలో ఎక్కువ శాతం టిడిపి నుండి పోయిన వారే నన్నారు. అన్నీ వడ్డీతో సహ తిరిగిఇస్తామన్నారు. ఒక్క నిమిషం నేను బ్యాలెన్స్ తప్పితే మరో భీభత్సం జరిగేదన్నారు. వెనుక కారులో మహిళలచేత కారం పొడి ప్యాకెట్లు తెచ్చి కళ్లల్లో కొట్టి దాడి చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజులలో వైసీపీకి తగిన గుణపాఠం దప్పదని హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు...
- జిరాక్స్ సెంటర్లు మూసివేత
- పరీక్షా కేంద్రాలకు స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ మల్లికగర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం12 గంటల వరకు నిర్వహించు ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మల్లికగర్గ్ తెలియచేసారు. పరీక్షల సమ యంలో ఎటువంటి అవాంచనీయ సంఘ టనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఆర్మ్డ్ గార్డులను పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చే టప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నా మని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణ నిర్వహించేందుకు ఇతర శాఖల సమయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేసామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, పరీక్షలు జరుగు సమ యంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోరని, కావున దయచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సరైన సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా చూడాలని సూచించారు.పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది కూడా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు. చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266కు సమాచారం అందించాలని ఎస్పీ తెలియచేసారు.

కలిసి పోరాడితే సమస్యలు పరిష్కారం

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : కలిసి పోరాడితేనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించు కోగల మని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూ డబ్ల్యూజే యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించుకోవడం కోసం అందరూ కలిసికట్టుగా ఎవరివంతు వారు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వాలు జర్నలిస్టులను మభ్యపెడుతున్నాయని అన్నారు. పలు సమస్యలపై పరిష్కరించుకొనే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలు జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ సురేష్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనకయ్య, ఐజేయూ సభ్యులు ఎన్‌వి రమణ, యూనియన్ ముఖ్య నాయకులు మూడు నియోజకవర్గాల జర్నలిస్టు మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

చెన్నయ్య కుటుంబానికి ఉగ్ర పరామర్శ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో సోమవారం నాడు టీడీపీ నాయకుడు బాల చెన్నయ్య మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వారి స్వగ్రామానికి వెళ్లి చెన్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్య క్షులు సానికొమ్ము

తిరుపతిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, బ్రహ్మం గౌడ్, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి తిరుణాల

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

విశాలాంధ్ర-దర్శి : దర్శి పటంలో మంగళవారం ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరుణాల మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వేకువజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ జిల్లా పరిషత్ చైర్మన్ బొచేపల్లి వెంకాయమ్మ మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి స్వామివారి దర్శించుకున్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న చైర్మన్

అన్నదానాన్ని ప్రారంభించిన శివ ప్రసాదరెడ్డి

ప్రసన్న ఆంజనేయ స్వామి వార్షిక తిరుణాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ మాజీ శాసనసభ్యులు శివప్రసాద్‌రెడ్డిలు భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తిరుణాలలో రెండు విద్యుత్ ప్రభలు, పాటకచేరి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక డిఎస్పి నారాయణస్వామి ఆధ్వర్యంలో కట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నులి పురుగులను నివారిస్తే సంపూర్ణ ఆరోగ్యం

సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని కృష్ణంశెట్టిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ నులిపురుగుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించాలన్న లక్ష్యంతో జాతీయ పోషకాహార విధానంలో భాగంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నారని నెలల వయస్సున్న వారి నుంచి వృద్ధుల వరకు నులిపురుగులు ఇబ్బందులు పెడుతుంటాయని పొట్టలోకి సులువుగా చేరి హాని కలిగిస్తాయని రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే వారిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఏటా నులిపురుగుల నివారణ కోసం మాత్రలను ఇస్తుంటారని 1నుండి 02 సం "రాల వయసు గల వారికి ఆల్బెండజోలు 400 గ్రాము మాత్రలో సగం టాబ్లెట్ తీసుకోవాలని రెండు నుండి 19 సంవత్సరాల వయసు కలవారికి ఆల్బెండెజోల్ 400 గ్రాము పూర్తి మాత్ర తీసుకోవాలని ఆయన తెలియజేశారు. గిద్దలూరు మండలము లో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ గిద్దలూరులో గల అంగన్‌వాడీ, ప్రాథమిక, పాటశాలలో , కళాశాలలో అల్బెండజోలే మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఓ షేక్ ముంతాజ్, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు హెల్త్ అసిస్టెంట్ ఖాజా, భాష, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లానింగ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలలో అవకాశాలు బాగా పెరుగుచున్న (ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ) ప్రణాళిక, నిర్మాణ రంగాలకు సంబంధించి జాతీయ కళాశాలల ఏర్పాటు గురించి, ఈ రంగాలలో మానవ వనరుల అభివృద్ధికి ప్రభుత్వ చర్యల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి డాక్టర్ సుభాస్ సర్కార్ సమాధానమిస్తూ 2018-2019 బడ్జెటులో దేశంలో 2 పూర్తి స్థాయి ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చర్ (ప్రణాళిక మరియు నిర్మాణం) యూనివర్సిటీల ఏర్పాటుకు మరియు 18 నూతన ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ శాఖలను బాగా స్థిరపడిన ఐ.ఐ.టీ. నిట్ కళాశాలలో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయబడ్డాయని, కాని దేశంలో ఏర్పడ్డ కోవిడ్ ప్రభావంతో 2020-21లో వీటి ఏర్పాటుకు ఆర్థిక ఖర్చుల శాఖ అంగీకరించక భవిష్యద్ ఆర్థిక సంవత్సరంలో వీటి ఏర్పాటుకు నిర్ణయించి లోగడ ప్రతిపాదనలను తిరిగి అంచనా వేయుటకు ఒక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. నేషనల్ ఎడ్యూకేషన్ పాలసి 2020 క్రింద ముఖ్యంగా బహుళ క్రమ శిక్షణ తదితర అనేక విద్యా సంస్కరణలను చేపట్టబడుచున్నవని, దేశంలో పూర్తి సమర్థతతో 5 నూతన కేంద్రాలను భిన్న ప్రాంతాలలోని ప్రస్తుత విద్యాసంస్థలలో ఏర్పాటుకు 2022-2023 బడ్జెటులో ప్రకటించడం జరిగిం దని, కేంద్ర గృహ మరియు పట్టాణ వ్యవహారాల శాఖ ఈ ప్రాజెక్టును నడిపిస్తుందని, ఈ కళాశాలల వలన నిర్దిష్ట జ్ఞానం, సర్టిఫైడ్ శిక్షణ కలుగుతుందన్నారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

EP 431/2018 ARC 181/2015
M/s. Shriram City Union Finance Ltd., Chirala Branch
Rep. by It's Divisional Executive & GPA holder Ongole Division, Prakasam (Dt.) .. D.H.
Vs
Jeedi Nagarjuna and '3' others - JDR's

2nd J.Dr. యొక్క ఆస్తుల వేలం ప్రకటన
పై నెంబరు గల E.P లో D.Hr E.P. బాకీని వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖల స్థిరాస్తిని వేలమునకు తెచ్చియున్నారు. సదరు వేలం శ్రీ కోర్టు వారి ఎదుట తేది. 10.04.2023 న ఉదయం గం.10.30ని.లకు వేలం పాట జరుగును. కావున సదరు కోర్టులో జరుగు బహిరంగ వేలంలో యావన్మంది వేలంపాటలో పాల్గొని పాట పాడుకోవలసినదిగా పైకోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియచేయడమైనది.

షెడ్యూలు :
ప్రకాశం జిల్లా, పొదిలి సబ్ రిజిస్ట్రేషన్, పొదిలి(మండలం),పొదిలి గ్రామంలో గల సర్వే నెం.858/1, 857/2, 857/3లలో ప్లాట్ నెం.9, 236 చ॥గ॥ల ఖాళీ స్థలంకు హద్దులు : తూర్పు : 20 అడుగుల వెడల్పు రాస్తా, దక్షిణం : అమ్మినవారి యొక్క మిగులు స్థలం మరియు షేక్ మస్తాన్ బీబీ'స్ యొక్క ప్లాట్ నెం.8 & 7ల స్థలం, పడమర : ఇరిగేషన్ కాలువ, ఉత్తరం : అమ్మినవారి యొక్క ప్లాట్ నెం.10 ఖాళీస్థలం.

D.Hr. Value : Rs.13,76,353-00
SRO Market Value : Rs.16,87,400-00
అమీనా విలువ : రూ. 14,00,000-00
వేలం వాయిదా : తేది : 10.04.2023
ఫర్దర్ హియరింగ్ తేది : 17.04.2023
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
స్థలం : మార్కాపురం తేది : 14.03.2023

జటప్రోలు సుబ్బరామకృష్ణ శాస్త్రి, B.Sc., LLB
D.Hr. తరపు అడ్వకేటు
మార్కాపురం-523316. సెల్ : 98854 56270

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : నేటి నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా యర్రగొండపాలెం టౌన్‌లోని పరీక్షా కేంద్రాలు అయిన గౌతమీ కాలేజీ, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, సాధన జూనియర్ కాలేజ్, గురుకుల పాఠశాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని యర్రగొండపాలెం ఎస్సై కోటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఉండే జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థిని, విద్యార్థులు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎవరైనా అనుమానంగా తిరుగుతున్నట్లు, లేదా స్లిప్పులు పంపిణీ చేయడానికి పాల్పడితే అట్టివారిపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బీఎంసీ కుటుంబాన్ని పరామర్శించిన మాధవరావు

విశాలాంధ్ర-పామూరు : టీడిపి నాయకులు మాజీ జెడ్పీటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి ఈ నెల నాలుగో తేదీన గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు దిగ్భ్రాంతి చెందారు. సోమవారం రాత్రి కనిగిరి మాజీ శాసనసభ్యులు టీడిపి ఇంచార్జ్ డాక్టర్ నరసింహారెడ్డితో కలిసి మాధవరావు శ్రీమహాలక్ష్మి డైరీలోని బిఎంసి గృహానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని, బీఎంసీ కుమారుడు నరసింహారావును ఓదార్చారు. పార్టీకి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, సయ్యద్ అమీర్ బాబు, మన్నం రమణయ్య, దోలా శేషాద్రి,గల్లా చెన్నయ్య, ఇర్రి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గంగసాని

విశాలాంధ్ర-పామూరు : సూర్య చంద్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుసేన్‌రెడ్డి ప్రారంభించారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ కడియాల రాంప్రసాద్ ప్రముఖ గుండె వైద్య నిపుణులుచే వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు సూచనలు సలహాలు అందజేశారు. ఇటీవల ఎక్కువగా గుండెపోటుతో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్న దున వైద్య శిబిరానికి ప్రాధాన్యత లభించింది. కార్యక్రమంలో సూర్య చంద్ర సేవా సంస్థ అధ్యక్షులు మాజీ సర్పంచ్ డివి మనోహర్, వైసిపి మండల యువజన అధ్యక్షులు యాదాల వెంకట సాయి కిరణ్, జడ్పీటిసి చప్పిడి సుబ్బయ్య, కనుమల్లపూడి గురునాథం, టైపు కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో రబీ 'ఈ-క్రాప్' నమోదు వివరాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రబి పంట కాలానికి ఈ క్రాప్ నమోదు వివరాలు సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని రైతు భరోసా కేంద్రం 1 నందు ఈ క్రాపు నమోదు చేసుకున్న రైతుల వివరాలను మంగళవారం అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022- 23 ఆర్థిక సంవత్సరానికి గాను రబీ పంట కాలానికి ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. రబీ కాలానికి గాను 27 రకాల పంటలు 2883.71 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించిన పంటల వివరాలను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త భారత్ అభియాన్



విశాలాంధ్ర-పెద్దదోర్నాల : టీబి రోగులకు పౌష్టిక ఆహారాన్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ భాస్కర్ కుమార్ మంగళవారం దోర్నాల ప్రభుత్వ వైద్యశాల యందు ప్రధానమంత్రి టిబి ముక్త భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా 50 మంది టిబి రోగులకి ,పౌష్టిక ఆహార కిట్లను హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ భాస్కర్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ రోగులు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో టీబి యూనిట్ సిబ్బంది వెంకట్రావు, ఎల్‌టి చిరంజీవి పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

- ఊహించన విధంగా పెరిగిన పోలింగ్ శాతం
- రేపు కౌంటింగ్ - అభ్యర్థుల్లో ఉత్కంఠ
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : పట్ట భద్రులు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ చెదురు ముదురు ఘటనలు మినహా ముగిసింది. అభ్యర్థుల గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ప్రజల తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో దాగివుంది. ఊహించిన విధంగానే ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎన్నిక ఓటింగ్ శాతం బాగా పెరిగింది. అయితే అధికార పార్టీ దొంగ ఓట్లు వేయించు కోవడం వలనే ఓటింగ్ శాతం పెరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఏదేమైనా ఉపాధ్యాయ ఎంఎల్‌సికి 91.40 పట్టభద్రుల ఎంఎల్‌సికి 69.35 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఉత్సాహం చూపారు. మార్కాపురం డివిజన్‌లో అత్యధికశాతం ఓటింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా గెలుపుపై బరిలో ఉన్న పీడీఎఫ్, వైసీపీ, తెలుగుదేశం అభ్యర్థులు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ స్థానానికి మాత్రం పీడీఎఫ్ అభ్యర్థులు విజయం తథ్యమని అందరూ భావిస్తున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు కూడా పీడీఎఫ్ అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా వైసీపీ మాత్రం ఉపాధ్యాయులకు ఐదు వేల రూపాయలు నుంచి పది వేల రూపాయల వరకు ఓటర్లుకు డబ్బులు ఇచ్చి ఓటర్లను కొనుగోలు చేసుకున్న విషయం విదితమే. విజ్ఞత గల ఉపాధ్యాయులు డబ్బు తీసుకున్నా ఓటు ఎవరికి వేశారనేది అందరిలోను చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యాయ ఎంఎల్‌సి గెలుపులో ప్రైవేటు టీచర్ల ఓట్లు కీలకంగా మారనున్నాయి. అధికార వైసీపీ మొదటి నుంచి ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఓటర్లుగా చేర్చుకునే దగ్గర నుంచి వారికి డబ్బులు పంపిణీ చేసేంతవ వరకు వ్యూహాత్మకంగా వ్యవహరించింది. దీంతో గెలుపు పట్ల వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు డబ్బులు ఇచ్చి వ్యూహాత్మకంగా వ్యవహరించినా ఓట్లు మాత్రం పీడీఎఫ్ అభ్యర్థులకు వేసి ఉంటారనేది చర్చ ప్రధానంగా జరుగుతుంది. తెలుగుదేశం పార్టీ కూడా రెండవ ప్రాధాన్యత ఓటును పీడీఎఫ్ అభ్యర్థులకు వేయమని చెప్పిన నేపథ్యంలో పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు ఖాయమని భావిస్తున్నారు. పట్టభద్రులు స్థానం మాత్రం తెలుగుదేశం పార్టీ ఆశలు పెట్టుకొని ఉంది. రెండు స్థానాల్లో మేమే గెలుస్తామని వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఉత్కంఠ భరితంగాసాగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తుండగా అభ్యర్థుల భవితవ్యం మాత్రం బ్యాలెట్ బాక్సుల్లో దాగివుంది.

మహిళా పోలీసుగా కారుణ్య నియామకం

- జిల్లా ఎస్పీ మలిక గర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి కారుణ్య నియామక క్రింద మహిళా పోలీసుగా నియమిస్తూ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నియామక పత్రం అందజేసినారు. ఏపీఎస్‌ఆర్టీసీలో అడిషనల్ డిపో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తూ 2011లో మరణించిన యం కృష్ణ మూర్తి కుమార్తె సుజాతారాణికి మద్దిపాడు మండలంలోని మద్దిపాడు-1 గ్రామ సచివాలయంలో మహిళా పోలీసులుగా కారుణ్య నియామకం కింద పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. గ్రామ సచివాలయ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణ, అసాంఘిక/చట్ట వ్యతిరేక కార్యక్రమాలు మరియు ఇతర విషయాలకు సంబంధించి సమాచార సేకరణలో కీలకంగా వ్యవరించాలని, అంకితభావంతో కష్టపడి పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, జిల్లాలో పోలీసులకు ఎల్లప్పుడూ సహకరిస్తూ మంచి పేరు సంపాదించాలని జిల్లా ఎస్పీ సూచించారు. డీపీఓ ఏఓ యం.సులోచన మరియు మహిళ పోలీస్ క్లర్క్ యు.రామకృష్ణ పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన వారిని వదిలి దామచర్లపై కేసు నమోదా?

- పోలీసులు వివక్షపూరితంగా వ్యవహరించడం దారుణం
- ఒంగోలు ఘటన అధికార దుర్వినియోగానికి పరాకాష్ట
- టీడీపీ ఎమ్మెల్యేలు డోలా, గొట్టిపాటి, ఏలూరి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ :
ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒంగోలులో దౌర్జన్యం చేసిన వైసీపీ నాయకులను వదిలి ప్రతిపక్ష టిడిపి నాయకులపై కేసులను నమోదు చేయడం ఏమిటని తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావులు ప్రశ్నిం చారు. ఒంగోలులో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పై దాడిని, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పై పెట్టిన అక్రమ కేసును ఖండిస్తూ వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంగోలులో తూర్పు రాయలసీమ పట్టబద్రుల ఎన్నికల సమయంలో అధికార పార్టీ నేతలు అరాచకాలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. పోలింగ్ బూత్‌లో జరిగిన ఘటనను తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, టిడిపి కార్యకర్తలపై వైసీపీ నేతలు దౌర్జన్యం చేయడం వైసిపి అరాచక పాలన నిదర్శనం అన్నారు. టిడిపి కార్యకర్తలపై వైసీపీ నాయకులతో కలిసి పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడం దారుణం అన్నారు. దౌర్జన్యం చేసిన వైసీపీ నాయకులను వదిలి దెబ్బలు తిన్న టిడిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు సైతం అధికార పక్షానికి వత్తాసు పలకడం సరికాదన్నారు. ఒంగోలులో జరిగిన ఘటన వైసిపి ప్రభుత్వం అరాచకానికి పరాకాష్ట అన్నారు. అధికార పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడినా పోలీసులు, అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌పై కేసు పెట్టడం ఏమిటని,తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలజడి సృష్టించిన వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమన్నారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీసులే ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఒంగోలులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

గురు స్వామి శరభయ్య మృతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండల కేంద్రమైన నాగులుప్పలపాడులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థాన వ్యవ స్థాపకులు గురుస్వామి చెడిపోతు శరభయ్య (84) మంగళవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. కమిషనర్ ఆయన మున్సిపల్ కమిషనర్ గాను పంచాయితీ రాజుగా గురుస్వామిగా ప్రజలకు సేవలు అందించారు. వీరబ్రహ్మేంద్రస్వామి మాలధారణను కొనసాగిస్తూ గురుస్వామిగా వ్యవహరిస్తున్నారు. ఇంకొల్లు రోడ్‌లో ఇటీవల నూతనంగా ఆశ్రమం సైతం నిర్మించారు. ఆయన మృతి పట్ల చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణ మూర్తి ఎత్తిపోతల పథకం మాజీ అధ్యక్షులు ఉప్పుటూరి సింగయ్య గ్రామ ప్రముఖులు సహచర ఉద్యోగులు శరభయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-త్రిపురాంతకం :
ఇంటర్ పరీక్షలను నిర్వహించడానికి త్రిపురాంతకం కళాశాలలో సర్వం సిద్ధం అయిందని కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ రామలక్ష్మి తెలిపారు. ఈ కళాశాలలో త్రిపురాంతకం ప్రభుత్వ కళాశాల, కేజీబివి కళాశాల, దూపాడు గురుకుల కళాశాల,వైష?వి ప్రవేట్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తునట్లు కళాశాల చీఫ్ రామలక్ష్మి తెలిపారు. 15వ తేదీ దూపాడు నుండి 51 మంది, కేజిబివీ నుండి32మంది, త్రిపురాంతకం ప్రభుత్వ కళాశాల నుండి 82 మంది, వైష్ణవి జూనియర్ కాలేజ్ నుండి 32 మంది పరీక్షలు వ్రాస్తున్నారు.17 తేదీ సీనియర్ ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తూ వుండగా దూపాడు నుండి 61 మంది, కేజిబివీ 32 మంది, త్రిపురాంతకం ప్రభుత్వ కళాశాల నుండి123 మంది, వైష్ణవి జూనియర్ కాలేజ్ నుండి32 మంది పరీక్షలు వ్రాస్తున్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో ఆన్లైన్ సిసి కెమెరాల నిగా వుంటుందని ఆమె తెలిపారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో వునట్లు ఆమె తెలిపారు.

పరీక్షలు హాజరు అయ్యే విద్యార్థులు ఉదయం 8:15 గంటల సమయం లోగా పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని ఆమె సూచించారు. వీరితో పాటుగా గత సంవత్సర కాలంలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు సపల్మేటరి విధానం ద్వారా పరీక్షలు రాస్తున్నట్లు ఆమె తెలిపారు.

జాతీయ నులి పురుగులు దినోత్సవం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జాతీయ నులి పురుగులు దినోత్సంగా సందర్భంగా కోవీలంపాడు యుపి స్కూల్‌లో పిల్లలకి స్థానిక సర్పంచి బుజ్జి మాత్రలు మింగించి పలు సూచనలు చేశారు. బుజ్జి మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకోవాలని, జాగ్రత్తగా ఉండాలని చెప్పటం జరిగింది. అనంతరం జగనన్న గోరుముద్ద పిల్లలకు మధ్యాహ్నం భోజనం ఎలా ఉంది అని అడగ అందరూ బాగుందని చెప్పటం జరిగింది. వారితో కలిసి భోజనం చేసి నాణ్యమైన భోజనం ఏర్పాటు చేసిన జగనన్నకు హ్యాట్సాఫ్ చెప్పారు పిల్లలు. సర్పంచితో పాటు సచివాలయం కన్వీనర్ బలభద్ర జాన్‌బాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్. శివారెడ్డి హెల్త్ సిబ్బంది రమాదేవి, నిఖిత, స్కూల్ హెడ్మాస్టర్, టీచర్ పాల్గొన్నారు.

కుల రాజకీయాలకు జనసేన వ్యతిరేకం

- రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ

విశాలాంధ్ర-మద్దిపాడు : కులమత తత్వ రాజకీయాలకు జనసేన పార్టీ వ్యతిరేకమని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఏర్పాటు చేయడం జరిగిందని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని అంజయ్య నగర్ చెందిన వీర జన సైనికుడు అంగలకుర్తి సుమంత్ సమస్మరణ సభను ఆ గ్రామ జనసైనికులు ఏర్పాటు చేయడం జరిగింది. సభాధ్యక్షులుగా గ్రామ పార్టీ అధ్యక్షులు అంగలకుర్తి నరసింహారావు నిర్వహించడం జరిగింది. ముందుగా సభకు హాజరైనటువంటి అతిథులు పార్టీ జెండాను ఆవిష్కరించి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, వీర జన సైనికుడు స్వర్గీయ అంగలకుర్తి సుమంత్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ పాల్గొని ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి రెండు కులాలే పాలకవర్గాలుగా మారాయని, ప్రజాస్వామ్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించినటువంటి అమూల్యమైనటువంటి ఓటును అమ్ముకొనుటవలన ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నున్న బాల సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు తిరుమల శెట్టి చిరంజీవి మండల కమిటీ సభ్యులు జి శేఖర్ ఎన్ వంశీకృష్ణ జి భాను పొన్నం అయ్యప్ప జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డాక్టర్ అర్ సాయీ ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమము నిర్వహించారు. చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధిలో ఉన్న అన్ని అంగాన్ వాడి సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలలు, కాలేజీల నందు విద్యార్థులకు అల్ బెండజోల్ మాత్రలు మింగించటము జరిగింది. విద్యార్థులకు వ్యక్తి గత పరిశుభ్రత గురించి, హ్యాండ్ వాష్ గురించి తెలియజేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో చింతల సిహెచ్‌ఓ పి.మంత్రు నాయక్, యం.పి.హెచ్. ఈ.ఓ,సూపర్ వైసర్‌లు కే.అన్న పూర్ణమ్మ, కే.పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ ఏ.భరత్ భూషణ్ ఉన్నారు.

పలాయనమా ! పరిహాసమా!

- గిద్దలూరు మెజార్టీ ఎవరి కోసమో తేలాలి
- అది రాంబాబు కోసమా? జగన్ కోసమా?
- ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షలో బాలినేని చమత్కారం

మాట్లాడుతున్న బాలినేని (ఫైల్)

విశాలాంధ్ర-అర్ధవీడు : 2019 ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సాధించిన మెజారిటీ పై గిద్దలూరు రాజకీయం మరో మారు మదన పడుతోంది. ఇందుకు వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పర్యటన ఊతమిచ్చింది. ఈ నెల 11న బెస్తవా రిపేటలో దర్గా కొండపై వైసిపి నిర్వహించిన ఎంఎల్‌సి ఎన్నికల సమీక్షలో బాలినేని మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి తరువాత 81 వేల మెజారిటీ సాధించింది గిద్దలూరు నియోజకవర్గం అని గుర్తుపెట్టు కోవాలన్నారు. ఆ వెంటనే, మరి ఇది రాంబాబు కోసమా! జగన్ కోసమా ! తేలాలి అని తేల్చి చెప్పారు. ఎంఎల్‌సి ఎన్నికల ముంగిట, రాబోవు ఎన్నికల వేళ బాలినేని గీసిన ఈ చమత్కారపు గీటు తాజా చర్చకు దారి తీసింది. ఇంతకీ గిద్దలూరు నియోజకవర్గ ఓటరు తమ భవిష్యత్ కోసం కాకుండా, రాంబాబు కోసమో! జగన్ కోసమో ! మెజారిటీ ఇచ్చారా ..! అంటే భిన్న స్పందనలు వినిపిస్తున్నాయి. జగన్ కోసమే మెజారిటీ ఇచ్చారని బాలినేని తన మాటల్లో చెప్పకనే చెప్పారు. అత్యధిక మెజారిటీ సాధించింది జగన్ మోహన్ రెడ్డి తరువాత గిద్దలూరు నియోజకవర్గం అన్నారే తప్పా, రాంబాబు అని చెప్పకపోవడం అందుకు నిదర్శనం. సాధారణ ఎన్నికల్లో జగన్ కోసమే మెజారిటీ అని స్పష్టత వున్నప్పుడు ఎంఎల్‌సి ఎన్నికల ముందు ఈ ఫజిల్ ఎందుకు? అనే ప్రశ్న ఉదయించక మానదు. బదులుగా అది ఫజిల్ కాదు పలాయనం, పరిహాసం అనే ద్విముఖ వ్యూహం అనే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితిని, రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యూహ రచనా చేశారంటు న్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లు ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ యువకులు , టీచర్లు. వీరు మాస్ ఓటర్లు కాదు. వీరంతా సాధారణ ఓటరు కన్నా చైతన్యవంతులు. తమ హక్కుల సాధన కోసం తక్షణమే స్పందించ గల సమర్థులు. ఉద్యోగులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులు కారు. ఈ విధంగా ప్రభుత్వం నుండి లబ్ది పొందింది లేదు. కానీ వారికీ హక్కుగా అమలు కావాల్సిన పి ఆర్సీ, డిఏ, హెచ్‌ఆర్‌ఏ సందిగ్ధంలో పడ్డాయి. సిపి ఎస్ రద్దు చేస్తామన్న ఎన్నికల హామీ అమలు కాలేదు. ఇవన్నీ ప్రభుత్వం పట్ల ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొంది. ఇది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిభింబిస్తే రాబోవు ఎన్నికలు సవాలుగా మారె ప్రమాదాన్ని వైసిపి గుర్తించింది. ప్రతిపక్షం దాడి పెరుగుతుందని పసిగట్టింది. నివారణగా గతంలో ఎన్నడూలేని విధంగా ప్రయివేట్ , కాంట్రాక్టు టీచర్లకు ఓటు హక్కు కలిపించింది. మరో వైపు ఎం ఎల్ సి ఎన్నికల గెలుపోటముల భాద్యత వైసిపి తన ఎమ్మెల్యేలకు, పార్టీ సమన్వయకర్తలకు అప్పగించింది. సానుకూల ఫలితాలొస్తే అది ప్రభుత్వ పనితనానికి నిదర్శనంగా చెప్పి, మరింత పట్టు బిగించవచ్చు. ప్రతికూలత ఎదురవుతే ఎమ్మెల్యే అసమర్ధతగా తేల్చవచ్చు. ప్రతిపక్ష దాడిని ఎదుర్కోవచ్చు. ఇదే జరిగితే స్థానికంగా రగిలే అసమ్మతికి ఆయుధం లభించినట్లవుతోంది. ఇదీ చమత్కార ఫజిల్ లోగుట్టు అంటున్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : కౌలు రైతులకు భూ యజమాని తీసుకునే పంటరుణంతో సంబంధం లేకుండానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవండ్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్లో జరిగే ఏపీ కౌలు రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం 2019ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. సొంత భూమిలేని కౌలు రైతులందరికీ రైతు భరోసా ఎకరానికి 10 వేలు అందించాలన్నారు. 55 సంవత్సరాలు పైబడిన ప్రతి కౌలు రైతుకు ప్రతినెల పదివేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కౌలు రేట్లు నిర?యించడానికి కౌలు రైతుల ధరలు నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. దేవాదాయ, ధర్మాదాయ కౌలు రైతులకు రైతాంగానికి వర్తింపజేసే వ్యవసాయ సబ్సిడీ పథకాలన్నీ అందించాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు జి.గురునాథం, బాణాలు రామయ్య, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు పూర్ణకంటి తిరుమలయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్ విశ్వరూపాచారి,సాంబ శివయ్య, నక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూలుకు బంగారు పతకాలు

విశాలాంధ్ర - శింగరాయకొండ : ఒంగోలులో శ్రీచైతన్య టెక్నోస్కూలులో ఈనెల 11వతేదీన జరిగిన స్పైమార్షల్ ఆర్ట్స్ జిల్లా పోటీలలో శింగరాయకొండ భాష్యం విద్యార్థులు ఉస్మాన్, గని, రెహమాన్, రాజ్, సాత్విక్ బంగారు పతకాలు సాధించారు. మరో 8మంది విద్యార్థులు వెండిపతకాలు కూడా సాధించినట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణ తెలిపారు.ఈపాఠశాలలోని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

ఆల్బెండెంట్ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని సంజీవపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో డాక్టర్ షేక్. సుమయ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ సుమయ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల అన్ని అంగన్వాడీ కేంద్రాలు పాటశాలలలోని విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండెంట్ మాత్రలు అందించామని ఒకటి నుంచి 19 యేళ్ల విద్యార్థులందరికీ ఈ టాబ్లెట్స్ అందించామని, టాబ్లెట్స్ వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని అన్నారు. వీటి వాడకం రేపటి తరం ఆరోగ్య రక్షణకు దారి చూపిస్తుందని పేర్కొన్నారు. అపరిశుభ్రత వల్ల చిన్నారుల్లో నులిపురుగుల సమస్య తీవ్రంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.హెచ్.ఎస్ మల్లికార్జున్‌రెడ్డి, ఎం. పి .హెచ్.ఎస్ (ఫిమేల్) నాగవేణి, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులకు టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్నీ మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు సమిష్టిగా కృషి చేశారని, పార్టీ పిలుపు మేరకు గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు అందరూ కష్టపడ్డారని అన్నారు.

మత్స్య సంపద రక్షణకు ఆలీవ్ రిడ్ల తాబేళ్లు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో సూర్యలంక సముద్ర తీరములో ఎకో టూరిజంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాని ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ వెల్లడించారు. మంగళవారం బాపట్ల సూర్యలంక తీరంలో మంగళవారం ఆలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్లను కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్.పి వకుల్ జిందాల్ సముద్రములోకి వదిలారు. కలెక్టర్ మాట్లాడుతూ యాత్రికులు సముద్ర తీరప్రాంతంలో ఉన్న ఆలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్ల గుడ్లను కనబడితే పారవేయకుండా అటవీశాఖ అధికారులకు అప్పగించాలన్నారు. సముద్రలో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లకుండా ఆలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్లను సముద్రంలోకి వదలడం జరుగు తుందన్నారు. సూర్యలంక సముద్రతీరంలో ఆలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్లను వదిలి పెట్టడము చాలా సంతోషంగా ఉందన్నారు. సముద్ర తీరంలో అలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్లు గుడ్లు పొదగడానికి 7 ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.